క్లుప్తంగా

నేడు ఎన్డీఆర్ఎఫ్ టీం రాక

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం గ్రామంలో నేడు(మంగళవారం) ఉదయం 10.30గంటలకు ఎన్డీఆర్ఎఫ్ బృందం రానున్నట్లు కార్యదర్శి మంజూరుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామస్తులకు వర్షాలు, వరదలపై మ్యాక్‌డ్రిల్ చేసి అవగాహన కల్పించనున్నారని గ్రామస్తులు పాల్గొనాలని పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



రేగొండ: మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 36 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 12 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి, ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ వెంకటనారాయణ, పియు మేనేజర్ బత్తిని శ్రీనివాస్, క్షేత్ర సిబ్బంది లంసాని రమాదేవి, సాదు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నామినేషన్‌కు తరలిన నాయకులు



మల్హర్: కరీంనగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం కరీంనగర్‌కు తరలివెళ్లారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌తో కలిసి నరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ నామినేషన్ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, కటకం శ్రీనివాస్‌లు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ములుగు రూరల్ : మండలంలోని మల్లంపల్లి గ్రామంలో 2004–05లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు రెండు దశాబ్దాల కిందట తాము చదువుకున్న పాఠశాలలో ఒకే వేదికపై కలుసుకోవాలన్న ఆలోచనతో వారం రోజుల నుంచే పూర్వ విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకున్నారు. తమకు విద్య బోధించిన గురువులకు మెమొంటోలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అప్పటి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మృతి చెందిన చిన్ననాటి స్నేహితుడి స్వామి కుటుంబానికి తమ వంతు కృషిగా ఆర్థికసాయం అందించిన పరిపూర్ణాచారి, సునీల్, సతీష్, పాపరావు గార్లను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఇసుక క్వారీలు

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక దళారీ వ్యవస్థను నిర్మూలించాలని, ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఇసుక క్వారీలు చేస్తున్నట్లు జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టాల పేరుతో భారీ అక్రమాలకు దారి తీస్తోందన్నారు. ఆదివాసీ గ్రామాల్లో ఇసుక క్వారీలు ఫైల్ చేస్తూ (డీఎల్ఎస్సీ) నిర్వహించకుండా ఇసుక ర్యాంపుల కార్యనిర్వహణలు జరుపుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు సైతం ఏజెన్సీ ప్రాంత చట్టాలను పాతర వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటూరునాగారం (ఐటీడీఏ) వ్యాప్తంగా పట్టా భూముల పేర్లతో అక్రమంగా ఇసుక క్వారీలకు అనుమతులు ఇస్తున్నారని, ఇప్పటివరకు పట్టా భూముల్లో ఇసుక మేటలను తొగించి ఎంత భూమి సాగు చేశారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులు ప్రతాప్, నరేష్, చంటి, రవి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వెంకటాపురం (కె) : స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న విభేదాల నేపథ్యంలో సోమవారం ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన అధికారులకు మండల సీఐటీయూ నాయకులు కుమ్మరి శ్రీను ఆధ్వర్యంలో పలు డిమాండ్లపై వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీలు ఉన్న చోట ఉపాధ్యాయులను నియమించాన్నారు. సడాలు, భిక్షపతి, రత్నకుమారి పాల్గొన్నారు.

మిరప కోతలకు కూలీల కొరత

- పక్క మండలం నుంచి తీసుకొస్తున్న రైతులు
- ఖర్చు ఎక్కువ అవుతుందని ఆవేదన



తాలు మిరపకాయలు ఏరుతున్న కూలీలు

రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండలంలో మిరప కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. గతేడాది పత్తి ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో, వానకాలం సీజన్‌లో మండలంలో దాదాపు ఆరు వేల ఎకరాలలో మిర్చి సాగు చేశారు. రేగొండ మండలంలోని పొనగండ్ల, రేపాక, కనిపర్తి, గూడెపల్లి, దుంపిల్లపల్లి, భాగిర్థిపేట, తిరుమలగిరి, రంగయ్యపల్లి కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట, వెంకటేశ్వర్లపల్లి, కొత్తపల్లి, నిజాంపల్లి తదితర గ్రామాల్లో మిరప పంటను విరివిగా సాగు చేశారు. మండల వ్యాప్తంగా మిరపకాయలు ఒకేసారి కోతకు రావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. వాతావరణంలో మార్పులకు ఈ ఏడాది మిరప పంటలో తెగుళ్లు, నల్లి బెడద తీవ్రంగా ఉంది. దీంతో మిరపలో తాలు శాతం పెరిగింది. ఏరిన మిరప కాయలను ఎండబెట్టిన తరువాత తాలు కాయాలు ఏరటానికి సైతం కూలీల అవసరం వస్తుంది. దీంతో చేలలో మిరప కాయలు ఏరటంతో పాటు తాలు కాయలు ఏరటానికి కూలీలు వస్తున్నారు.

ఇతర మండలాల నుంచి కూలీలు..

గ్రామాల్లో కూలీలు దొరకపోవడంతో శాయంపేట, ఆత్మకూరు, మల్లంపల్లి మండలాల నుంచి ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్‌లలో కూలీలను తీసుకువస్తున్నారు. ఒక రోజు కూలి రూ.300 తో పాటు ఆటో కిరాయి, కలుపుకుని దూరాన్ని బట్టి రూ.350 నుంచి రూ.400 వరకు చెల్లిస్తున్నారు. ఒక క్వింటా ఎండు మిర్చి ఏరటానికి పది మంది పైగా కూలీలు అవసరం అవుతున్నారు. అలాగే డీబీఎం–38 కాలువ ద్వారా నీళ్లు రావడంతో చాలా గ్రామాల్లో యాసంగి వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. దీంతో కూలీలకు తీవ్ర కొరత ఏర్పడింది.

రూ.4 వేల ఖర్చు అవుతుంది



రోజుకు ఒక్కో కూలీకి రూ.300 చెల్లించటంతో పాటు, వారిని తీసుకు రావడానికి ఆటో కిరాయిలకు రోజుకు మరో రూ.1000 అదనంగా చెల్లిస్తున్నా. దీంతో పండించిన పంట ముప్పై శాతం కూలీలకే సరిపోతుంది. క్వింటా మిరప ఏరడానికి కూలీలకు రూ.4వేలు ఖర్చు అవుతుంది. వరి నాట్లు వేస్తుండటంతో కూలీల కొరత తీవ్రంగా ఉంది.

\- వన్నాల శివాజీ, రైతు, కొత్తపల్లిగోరి

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు అందజేస్తున్న డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో 13 సెల్‌ఫోన్లను పొగొట్టుకొగా బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. సీఐ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో డీఎస్పీ సంపత్‌రావు చేతుల మీదుగా సోమవారం అందజేశారు.

విద్యార్థికి ఉపాధ్యాయుల అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

టేకుమట్ల: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు మండలంలోని వెంకట్రావుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఏకు జశ్వంత్ జాతీయ స్థాయి అర్హత పరీక్షలోఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈదునూరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని అన్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అందించే నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు మండలంలో జశ్వంత్ ఎంపిక కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. అతనికి ప్రతీ సంవత్సరం రూ.12వేల ప్రోత్సాహక నగదును ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. జశ్వంత్‌ను ఉపాధ్యాయ బృందం శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుప్పాల రవిందర్, అనంతుల రాజు, ఆకారపు భుజేంద్రాచారి, గొట్టె సుదాకర్, షాపురపు శ్రీధర్, మేడిగడ్డ నాగరాజు పాల్గొన్నారు.

అట్టహాసంగా గొంతెమ్మ గుట్ట జాతర



గుట్టపై భక్తుల కోలాహలం

- అమ్మవార్లను దర్శించుకున్న వేలాదిమంది భక్తులు



శివలింగం దగ్గర పూజలు చేస్తున్న భక్తులు

కాటారం: ప్రాచీన చారిత్రాత్మక, దైవసంబంధిత ఆనవాళ్లు కలిగిన మండలంలోని ప్రతాపగిరి గొంతెమ్మ గుట్టపై సోమవారం నిర్వహించిన జాతర అట్టహాసంగా కొనసాగింది. శనివారం సాయంత్రం ప్రారంభమైన జాతర సోమవారం వైభవోపేత ఘట్టంతో ముగిసింది. పాండవుల భేరి వద్ద పట్నాలు వేసి లక్ష్మీదేవరకు పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన లక్ష్మీదేవర బృందాలు ఆడిపాడాయి. శివసత్తులు పూనకాలతో ఊగిపోగా భక్తులు బోనాలు వండి మొక్కులు సమర్పించారు. గుట్టపై శివలింగానికి ప్రత్యేక పూజలు జరిపించారు. గుట్టపై దేవతామూర్తుల ఆనవాళ్లను దర్శించుకొని భక్తులు భక్తి పారవశ్యంతో పరవశించిపోయారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తుల రాకతో గుట్ట ప్రాంతం నిండిపోయింది. భక్తులు ప్రతాపగిరి గుట్ట అందాలను వీక్షించారు. జాతర విశిష్టతను తిలకించి పరవశించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గుట్టలోపల శివలింగాన్ని దర్శించుకునే క్రమంలో భక్తులు కొంతమేర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జాతరలో అసాంఘిక ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ, జాతర కమిటీ నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కులగణన సర్వే

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చిట్యాల: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

మొగుళ్లపల్లి: రాష్ట్రంలో కులగణన సర్వే అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అవగాహన సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అంతకు ముందు భారీ ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని అనంతరం సభలో మాట్లాడుతూ.. కులగణన సర్వేను మళ్లీ చేయాలన్న కేటీఆర్ వ్యాఖ్యలను బీసీ సమాజం క్షమించదని అన్నారు. 2014లో బీఆర్ఎస్ సమగ్ర కుటుంబ సర్వే చేసి కనీసం ఆ లెక్కలను కూడా బయటకు చెప్పలేని, ఇప్పుడు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ పోలినేని రాజేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు మండ రవీందర్ గౌడ్, మోట్ ధర్మరావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోలినేని లింగారావు, రాము, ఎర్రబెల్లి పున్నం చందర్ రావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా..

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామంలో ఉన్న శివాలయ పునర్నిర్మాణానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం శివాలయం పునర్నిణానికి శంకుస్థాపన చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ఆలయం 200 సంవత్సరాల క్రితం కాకతీయులు నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, అప్పం కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, మాజీ సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ–రత్నాకర్‌రెడ్డి, మండల నాయకులు పువ్వాటి వెంకన్న, సర్వ శరత్, బుర్ర లక్ష్మణ్, దొడ్డి కిష్టయ్య పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరావు



కమిటీ సభ్యులతో నాయకులు

మొగుళ్లపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరావు అన్నారు. సోమవారం మండలంలోని ఇప్పలపల్లి, గణేశ్‌పల్లి, గుండ్లకర్తి గ్రామాల్లో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి, ఆయా గ్రామాల్లో నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సమావేశాలకు మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్, జిల్లా నాయకుడు శ్యాంసుందర్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్రంగా వ్యతిరేకత ఉందన్నారు. ఇప్పలపల్లి అధ్యక్షుడిగా తిరుపతి, ఉపాధ్యక్షులుగా గోమ్ముల రాజు, బైరగుని రాజేందర్, ప్రధాన కార్యదర్శిగడ్డి ఎన్నుకున్నారు. గణేశ్‌పల్లి అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గుమ్మడేల్లి రవి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గఫూర్, యూత్ అధ్యక్షుడిగా ఎర్రబాటి తిరుపతిరావు ఎన్నుకున్నారు. గుండ్లకర్తి అధ్యక్షుడి చెలిక సురేష్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, యూత్ అధ్యక్షుడి మురారి హరికృష్ణను నియమించారు. దానవేణి రాములు, తిరుపతికృష్ణ రెడ్డి, లవయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక



అలేఖ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాళేశ్వరం: జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ స్థాయి ఫిజికల్ సైన్స్ ఫోరం నిర్వహించిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో కాళేశ్వరం విద్యార్థి కటుకు అలేఖ్య రెండో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కి సోమవారం ఎంపిక అయింది. ఈ సందర్భంగా హెచ్ఎం బాసిరి అన్నపూర్ణ మాట్లాడుతూ.. మండల స్థాయిలో ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం చాలా సంతోషకరమన్నారు. ఫిజిక్స్, గైడ్ టీచర్ రాజేందర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

కృత్రిమ గర్భధారణతో మేలైన దూడల జననం


- డాక్టర్ మల్లేశ్వరీ



గర్భకోశ నివారణ చికిత్స శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మల్లేశ్వరీ

టేకుమట్ల: కృత్రిమ గర్భధారణ ద్వారా మేలైన దూడల జననం సాధ్యమని, తద్వారా పాడి సంతత వృద్ధి మెరుగుపడుతుందని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ మల్లేశ్వరీ అన్నారు. సోమవారం మండలంలోని పంగిడిపల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ గోపాలమిత్రల ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల నివారణ, కృత్రిమ గర్భధారణ వల్ల జన్మించిన దూడల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ చికిత్సలు చేసి, కృత్రిమ గర్భధారణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మండల కేంద్రంతో పాటు, మండలంలోని పంగిడిపల్లిలో గల పశువైద్యశాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల జీర్ణకోశ వ్యాధులకు కావాల్సిన మందులు సైతం అందుబాటులో ఉన్నాయని సూచించారు. వెంకట్రావుపల్లి పశువైద్యాధికారి డాక్టర్ వివేక్, గోపాల మిత్రల ఆధ్వర్యంలో ఇంటి వద్దనే పశువులకు కృత్రిమ గర్భధారణ చికిత్స చేస్తారని అన్నారు. ప్రస్తుతం పాడి వృద్ధి కోసం మేలైన ఆడ దూడల జననానికి వీర్యం అందుబాటులో ఉందన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన దూడలు, ఆరోగ్యకరంగా, శక్తివంతంగా, రోగనిరోధక శక్తిని కలిగి ఉంటాయన్నారు. అలాగే జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ.. పశువులకు అందించే పశు గ్రాసం కోసం గడ్డి విత్తనాలు సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా కార్యనిర్వహణ అధికారి డాక్టర్ రఘుబాబు, పశువైద్యాధికారులు డాక్టర్ గోపాల కృష్ణమూర్తి, వెంకన్న, డాక్టర్ వివేక్, శంకర్, శారద, గోపాలమిత్ర సూపర్‌వైజర్‌లు ప్రకాష్‌రెడ్డి, ఐలుమల్లు, రాజేశ్వర్‌రావు, గోపాలమిత్రలు కుమారస్వామి, రాజేందర్, అఫ్జల్, సుదర్శన్, శ్రీనివాస్, సతీష్, పాడి రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి చేయూత



సాయం అందజేస్తున్న రాజు, తదితరులు

కాటారం: ఇసుక లారీ ఢీకొని తీవ్ర గాయాలపాలై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ బాధితుడికి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చీమల రాజు, మిత్ర బృందం ఆధ్వర్యంలో చేయూతను అందజేశారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌పల్లికి చెందిన తోట రవి ఐదు రోజుల క్రితం పనుల నిమిత్తం మండల కేంద్రానికి రాగా ఇసుక లారీ వేగంతో వచ్చి ఢీకొట్టి ఈడ్చుకెళ్లింది. దీంతో ఆయన రెండు కాళ్లు నుజ్జునుజ్జు కాగా హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రికి తరలించగా రెండు కాళ్లను తొలగించారు. రవి నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో ఆస్పత్రిలో వైద్య ఖర్చులు భరించే స్థోమత కుటుంబ సభ్యులకు లేదు. దీంతో చీమల రాజు, మిత్ర బృందం సభ్యులు సోషల్ మీడియా, ప్రత్యక్షంగా దాతల ద్వారా విరాళాలు సేకరించారు. రూ.1.55లక్షలు జమ కాగా సోమవారం రవి తల్లి రాధమ్మ, కుమారుడు జయకృష్ణకు అందజేశారు. ఆపదలో ఉన్న బాధితుడికి సహాయం చేకూరేలా కృషి చేసిన చీమల రాజు, మిత్ర బృందం సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో జనగామ కరుణాకర్‌రావు, ఆత్మకూరి కుమార్‌యాదవ్, బచ్చు ప్రకాశ్, చీమల రాజయ్య, మాచేర్ల రాజేందర్, అమీర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

కాటారం: జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ ప్రతిభ పరీక్షల్లో కాటారం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పదో తరగతికి చెందిన మణిదీప్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో, అభిరాఘవ కల్యాణ్ తృతీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను డీఈఓ రాజేందర్ ప్రత్యేకంగా అభినందించి బహుమతులు, ప్రశంసా పత్రం అందజేసినట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఇరువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై టనట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ మాధవి, వెంకటయ్య, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు కొండ రాజయ్య, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

పరామర్శ

కాటారం: మండల కేంద్రానికి చెందిన సబ్దార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్ సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ముస్లిం మత పెద్దలు ఉన్నారు.

24న ‘మార్కెట్ సంఘం’ ఎన్నికలు



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శైలజ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం గిరిజన కోఆపరేటివ్ మార్కెట్ సంఘం ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆథారిటీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం డిప్యూటీ రిజిస్టార్ శైలజను ఎన్నికల సంఘం అధికారిగా సోమవారం నియమించారు. ఈ సందర్భంగా ఆమె మహదేవపూర్ కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికలను రహస్య బ్యాలెట్ ప్రకారం నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికలు నిర్వహించే పాలవర్గాల స్థానాలు 5 కాగా జనరల్ 3, మహిళ 2గా కేటాయించినట్లు పేర్కొన్నారు. నామినేషన్ ఫీజు ఎస్సీ, ఎస్టీలకు రూ.500, బీసీలకు రూ.700, ఓసీలకు రూ.1000 చొప్పున ఖరారు చేసినట్లు తెలిపారు. నామినేషన్‌ల స్వీకరణ ఈనెల 13 నుంచి 14 వరకు, నామినేషన్ పత్రాల పరిశీలన 16న, ఉపసంహరణ 17న, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా, గుర్తులు 17న సాయంత్రం 5గంటల తరువాత ప్రకటిస్తారని తెలిపారు. పోలింగ్ తేదీ 24 ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. మహదేవపూర్, కాటారం, మహాముత్తారం, మల్హర్, పలిమెల మండలాల గిరిజనులు పాల్గొంటారని, సభ్యత్వం కలిగి సంవత్సరం పూర్తయిన వారికి మాత్రమే ఓటు హక్కుల ఉంటుందని తెలిపారు. ఆమె వెంట డీఎస్ఓ భుక్యానాయక్ ఉన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానం

వాజేడు : స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు కరాటే బెల్ట్‌లను అందుకున్నారు. ఆదివారం వెంకటాపురం(కె) మండల పరిధిలోని కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ గ్రౌండ్‌లో సూర్యా సూడోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వాజేడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు కరాటే గ్రాండ్ మాస్టర్ బ్లాక్ బెల్ట్ పాయం సురేష్ చేతుల మీదుగా బెల్ట్‌లను అందించారు. సింధుకూరి మహేష్, పెనుమల్ల సీతారామ చంద్రారెడ్డి (బ్లూ బెల్ట్), అరికెళ్ల సాత్విక్ తేజ, బిల్లా రిషిభరత్ (ఎల్లో బెల్ట్) పొందారు. వీరికి ప్రశంసపత్రాలు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



రేగొండ: పరకాల–భూపాలపల్లి జాతీయ రహదారిపై చెన్నాపూర్ గ్రామంలో పెట్రోల్ బంక్ ఎదుట సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన బుర్రి నరేశ్ ఆటోలో పరకాలకు వెళ్లి తిరిగి వస్తుండగా చెన్నాపూర్ పెట్రోల్ బంక్ వద్ద ఆటో ముందు టైరు పేలడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో నరేష్‌కు తీవ్ర గాయాలవటంతో చికిత్స కోసం పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.